క్లుప్తంగా

'రేవు తిరగబడితే ఊరు కురుక్షేత్రమే' పుస్తకావిష్కరణ



నెహ్రూనగర్: నగరంలోని ఓ హోటల్‌లో శనివారం 'రేవు తిరగబడితే ఊరు కురుక్షేత్రమే' అనే పుస్తకాన్ని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రచురణకర్త డాక్టర్ అన్నవరపు నాగమల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు, అన్యాయాల్ని ఎదిరించి రజకులు చేసిన పోరాటాల్ని పుస్తక రూపంలో రచించిన రచయిత సుబ్బాచారి అభినందనీయులన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, కుమ్మర క్రాంతికుమార్, పూర్ణ, కృష్ణ, శ్రీరాములు, వసంత్, జాన్‌బాబు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



గుంటూరు మెడికల్: గుంటూరు రూరల్ మండలం గోరంట్ల ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల హాస్పిటల్‌లోని ఏఆర్టీ సెంటర్‌లో హెచ్ఐవీ చిన్నారులకు శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. లాంప్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ వెన్నెల, డాక్టర్ సరిత పర్యవేక్షణలో సంపూర్ణ పౌష్టికాహారం అందజేశారు. దాతల సాయంతో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.

నేడు త్రీడీ క్యాథ్ ల్యాబ్ ప్రారంభం



గుంటూరు మెడికల్: ఏపీలో మొదటిసారిగా త్రీడీ క్యాథ్ ల్యాబ్ సేవల్ని తమ ఆస్పత్రిలో ప్రారంభిస్తున్నట్లు కార్డియాలజిస్టు డాక్టర్ ఉప్పుటూరి అంజిత్ చెప్పారు. ఆదివారం ఉదయం 10 గంటలకు గుంటూరు కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని అమృత హాస్పిటల్స్ పై భాగంలో యాంజీయో కేర్ హార్ట్ అండ్ వాస్క్యులర్ ఇనిస్టిట్యూట్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. త్రీడీ క్యాథ్ ల్యాబ్‌తో యాంజీయోగ్రామ్, హార్ట్, బ్రెయిన్, లెగ్‌లో స్టంటింగ్, ఫేస్‌మేకర్, గుండె, బ్రెయిన్ సంబంధిత సమస్యలకు కచ్చితత్వంతో చికిత్స అందించవచ్చని చెప్పారు. సమావేశంలో న్యూరోసర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్, డాక్టర్ మద్ది వినోద్‌కుమార్, డాక్టర్ మండే సింధూర, డాక్టర్ చదలవాడ ప్రియ పాల్గొన్నారు.

కోర్టుల పనితీరుపై లా విద్యార్థులకు అవగాహన



గుంటూరు లీగల్: ఆంధ్ర క్రిష్టియన్ న్యాయ కళాశాల విద్యార్థులు శనివారం గుంటూరులోని కోర్టులను సందర్శించారు. లా చివరి సంవత్సరం విద్యార్థులు కోర్సులో భాగంగా కోర్టులు పని చేసే విధానంపై అవగాహన చేసుకున్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొని. కక్షిదారులు కేసులు రాజీ పడుతున్న తీరును గమనించారు. పలువురు సీనియర్ న్యాయవాదుల్ని కలసి వారి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి, నాలుగో అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నకుమార్ విద్యార్థులకు ఉపయోగపడే పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాలడుగు వెంకటేశ్వరరావు, బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, ఏసీ న్యాయ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బి.మోజెస్, వైస్ ప్రిన్సిపల్ జి.కిరణ్, పల్లె రాణిశ్రీ, అమృత వర్షిణి, అధ్యాపకులు బి.డానియేల్, లైబ్రేరియన్ డాక్టర్ బుర్రా మాణిక్యరావు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గిరిధర్

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు పేదల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు. 45వ డివిజన్ 134వ సచివాలయం పరిధిలోని చైతన్యపురి కాలనీ, హనుమయ్య నగర్‌లలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తుంటే పథకాల అమలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి కుటుంబానికీ మేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయని వివరించారు. అర్హతే ప్రామాణికంగా, అవినీతి రహితంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని చెప్పారు. అవినీతి రహిత పాలన జగనన్నతోనే సాధ్యమయ్యిందని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ లబ్ధి చేకూరిందని తెలిపారు. సీఎం జగన్‌కు చల్లని దీవెనలు అందించాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, 45వ డివిజన్ కార్పొరేటర్ యక్కలూరి మారుతి, పార్టీ నాయకులు యక్కలూరి కోటిలింగారెడ్డి, ఎండీ. మహబూబ్‌ఖాన్, యక్కలూరి వెంకటరెడ్డి, సుంకర రామకృష్ణారెడ్డి, వై.భరత్, రఫీ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



మాట్లాడుతున్న పీడీజే పార్థసారథి, చిత్రంలో ఏడీజే రామ్‌గోపాల్, కె.రత్నకుమార్, పాలడుగు

గుంటూరు లీగల్: విద్యావంతులు లోక్ అదాలత్‌లను చక్కగా వినియోగించుకుంటున్నారని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి తెలిపారు. గుంటూరు కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయమైన న్యాయ సేవా సదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సుతో ఆయన జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీజే పార్థసారథి మాట్లాడుతూ నిరక్షరాస్యులకు కూడా లోక్ అదాలత్‌పై అవగాహన కలిగించాలని సూచించారు. ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న కె.ఎల్.యు లా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సేవా భావంతో బాధితులకు అండగా నిలిచి మంచి న్యాయవాదులుగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నకుమార్, గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాలడుగు వెంకటేశ్వరరావు, బార్ కౌన్సిల్ మెంబర్లు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, సోమసాని బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

5,917 కేసులు పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా న్యాయ సేవాధికారం సంస్థల ద్వారా శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 5917 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నకుమార్ తెలిపారు. జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. సివిల్ 445, క్రిమినల్ 5349, ప్రీలిటిగేషన్ 123, వెరసి మొత్తం 5,917 కేసులు పరిష్కరించినట్లు వివరించారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సహకరించిన న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, ప్రభుత్వ సంస్థలు, కక్షిదారులు, న్యాయస్థాన సిబ్బందికి న్యాయ సేవాధికార సంస్థ తరపున ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: నటరాజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముత్యాలరెడ్డినగర్ 7వ లైనులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు న్యూరాలజిస్టు డాక్టర్ పి.నటరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బొడ్డు చంద్రయ్య నివాసం వద్ద నిర్వహించనున్న శిబిరంలో ఉచితంగా దంత, కంటి, షుగర్ పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు.

అద్భుతాలు సృష్టించే దిశగా విద్యార్థుల ఆలోచనలు ఉండాలి

ముగిసిన ఆర్‌వీఆర్ జేసీ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న యాజమాన్యం

గుంటూరు రూరల్: అద్భుతాలు సృష్టించే దిశగా ఇంజినీరింగ్ విద్యార్థుల ఆలోచనలు ఉండాలని టీసీఎస్ వైస్ ప్రెసిడెంట్ గ్లోబల్ ఆర్ఎంజీ హెడ్ ఈఎస్ చక్రవర్తి పేర్కొన్నారు. రెండు రోజులుగా చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న 38వ వార్షికోత్సవ వేడుకలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న చక్రవర్తి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి తల్లే తొలి గురువని చెప్పారు. విద్యార్థులు సమాచార నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటూ.. ప్రాంతీయ భాషలతో పాటు.. ఇతర భాషలపై పట్టు సాధించినప్పుడే విజయావకాశాలు త్వరితగతిన చేరువవుతాయన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ కళాశాల వార్షిక ఫలితాల నివేదికలను వివరించారు. తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తూ.. విద్యార్థి ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది పనిచేస్తుందని సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ స్పష్టం చేశారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సర్టిఫికెట్లు, మెమెంటోలను అతిథులు అందజేశారు. అతిథులను కళాశాల యాజమాన్యం సత్కరించింది. సీఎస్‌బీఎస్ విభాగానికి సంబంధించిన బ్రోచర్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, విభాగాధిపతి డా. ఎంవీపీ చంద్రశేఖర్ రావు ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక, జానపద నత్య, కళా ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, తెలుగు చలన చిత్ర నటుడు, పూర్వ విద్యార్థి కాకాని ధర్మమహేష్, కళాశాల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీ మోహన్, పాలక మండలి సభ్యులు పి.గోపీచంద్, రంగారావు, కళాశాల అకడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాస రావు, కళాశాల డీన్, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మస్తాన్‌షా ఉరుసు మహోత్సవాలు

పాత గుంటూరు: జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా దర్గా 131వ ఉరుసు మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా శనివారం బాబా సమాధిను పూలతో విశేషంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో బాబా సమాధిని దర్శించుకుని చాదర్లను సమర్పించారు. అనంతరం దర్గా నిర్వాహకుల ఆధర్యంలో భక్తులకు, ఫకీర్లకు అన్నదానం చేశారు. సాయంత్రం బాబాకు సంవత్సరంలో భక్తులు సమర్పించిన చాదర్‌లను ఫకీర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమాల్ని దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు, డూండీశ్వరీ పర్యవేక్షించారు.

దుకాణంలో చోరీ

పట్నంబజారు: దుకాణంలో చోరీపై కేసు నమోదైంది. సాయిబాబా కాలనీలోని ఓ నిత్యావసర సరుకుల దుకాణంలో శుక్రవారం రాత్రి దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ. 40వేలు విలువ చేసే సరుకులను ఎత్తుకుపోయారు. దుకాణ యజమాని భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకెళితే విజయం తథ్యం

భాష్యం స్పోర్ట్స్ మీట్‌లో వక్తలు



క్రీడాజ్యోతిని అందుకుంటున్న డాక్టర్ ముసాబిన్, డాక్టర్ బిందేష్

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్లడం ద్వారా విద్యార్థులు విజయాన్ని అందిపుచ్చుకోగలరని డాక్టర్ షేక్ ముసాబిన్ సూచించారు. గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్ మైదానంలో శనివారం స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ముసాబిన్ మాట్లాడుతూ ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, వాటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లిన వారే విజేతలుగా నిలుస్తారని తెలిపారు. విద్యార్థులంతా ఆత్మవిశ్వాసంతో దృఢ నిశ్చయాన్ని ఏర్పరచుకుని, ఉన్నత లక్ష్యాల్ని సాధించాలని ఆకాంక్షించారు. మరొక అతిథి డాక్టర్ బి. బిందేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేందుకు క్రీడలు దోహదపడతాయని, శారీరక, మానసిక ఎదుగుదలకు ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. క్రీడలతో విద్యార్థుల్లో సానుకూల దృక్పథంతో పాటు ధైర్యం అలవడుతుందని పేర్కొన్నారు. ముందుగా అతిథుల చేతుల మీదుగా స్పోర్ట్స్‌మీట్ జెండాను ఆవిష్కరించారు. ఓపెన్ పరేడ్‌లో విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, క్రీడాజ్యోతిని వెలిగించి శాంతికి చిహ్నమైన పావురాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ క్రీడా విన్యాసాలు వీక్షకులను అలరించాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు. ఈసందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాష్యం గుంటూరు అర్బన్ జెడ్ఈవో స్వప్న, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 64 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో శనివారం స్పీకింగ్ ట్రీ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థులు 64 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం 210 మంది పాల్గొనగా వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో తుది దశకు చేరుకున్న 64 మంది విద్యార్థుల్ని ఏడాదికి రూ.1.80 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జె. మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, ప్లేస్‌మెంట్స్ అధికారి వై. సురేష్‌బాబు అభినందించారు.

మట్టిలో మాణిక్యాలు కలేకూరి, మద్దూరి, పైడి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా

పాత గుంటూరు: తెలుగు సాహిత్యంలో కవులు కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్‌బాబు, పైడి తెరేష్ బాబు మట్టిలో మాణిక్యాలని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ కొనియాడారు. బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో శనివారం అంబేడ్కర్, జాషువా, పూలే పెరియార్ రిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలేకూరి, మద్దూరి, పైడి తెరేష్‌బాబు దళిత బహుజనతత్వం అంశంపై సభ ఏర్పాటు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు బి. విల్సన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిశోర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జి.లక్ష్మీ నరసయ్య, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, సాహితీవేత్తలు అలోకం పెద్దబ్బాయి, జొన్నలగడ్డ రామారావు, బహుజన నాయకులు ఉగ్గం సాంబశివ రావు, జాన్‌బాబు చంద్రపాల్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువతి ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. స్తంభాల గరువుకు చెందిన చల్లా మరియమ్మ రెండో కుమార్తె తిరుపతమ్మ (20) ఇళ్లల్లో పనులు చేసుకుంటుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా కృంగిపోయింది.దీంతో శనివారం ఎలుకల మందు తింది. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.